నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

మేడ్చల్: మేడ్చల్ సబ్ స్టేషన్ పరిధిలో మరమ్మతుల కారణంగా నేడు విద్యుత్ సరఫరా ఉండదని ఏఈ రాంబాబు ఓ ప్రకటన ద్వారా తెలిపారు. మేడ్చల్ పరిధిలోని ఐడీఏ కండ్లకోయ, ఐడీఏ మేడ్చల్, చెక్‌పోస్ట్, వాటర్ గ్రిడ్, సీమర్, మేడ్చల్ ఐడీఏ-1లలో ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు అన్ని పరిశ్రమలకు విద్యుత్ సరఫరా ఉండదని ఏఈ తెలిపారు.

సంఘాల అభివృద్ధికి కృషి చేయాలి



కార్పొరేటర్ శేషగిరిని సన్మానిస్తున్న కమిటీ సభ్యులు

సుభాష్‌నగర్: సంక్షేమ సంఘాలు స్థానిక అభివృద్ధికి కృషి చేయాలని గాజులరామారం కార్పొరేటర్ రావుల శేషగిరి అన్నారు. శనివారం జరిగిన హెచ్‌ఏఎల్ ఏరో నగర్ అసోసియేషన్ సమావేశానికి ఆయన హాజరై మాట్లాడారు. సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తూ సుపరిపాలన అందించేలా సంక్షేమ సంఘం పని చేయాలన్నారు. అనంతరం కమిటీ సభ్యులు కార్పొరేటర్‌ను సత్కరించారు. సమావేశంలో ఉషోదయ కాలనీ ప్రెసిడెంట్ దేగల సతీష్‌బాబు, హెచ్‌ఏఎల్ ఏరో నగర్ ప్రెసిడెంట్ తిరుపతిరావు, సెక్రటరీ రాజ్‌గోపాల్, అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు

దాడి చేసిన దుండగులను అరెస్టు చేయాలి

నిజాంపేట్: వరంగల్ జిల్లా, నల్లబెల్లి మండల కేంద్ర పోలీస్‌స్టేషన్‌లో అగ్రకుల ఆధిపత్యంతో ప్రేమ జంటపై దాడి చేసిన దుండగులను తక్షణమే అరెస్టు చేయాలని కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి బాలపీరు డిమాండ్ చేశారు. శనివారం ఆయన మాట్లాడుతూ.. గత నెల 24న మణిరాజ్ -నితీష కులాంతర వివాహం చేసుకున్నారని, హన్మకొండ జిల్లా శాయంపేట మండల కేంద్రంలో గతంలో పోలీసులకు ఫిర్యాదు చేశారన్నారు. పోలీసులు కౌన్సిలింగ్ ఇచ్చి ఇరువురు మేజర్‌లు కావడం వల్ల పంపించారని తెలిపారు. ఆ జంటను విడదీయడానికి అమ్మాయి తండ్రి, బంధువులు పలుమార్లు బెదిరింపులకు పాల్పడ్డారన్నారు. మణిరాజ్ బంధువులపై మూకుమ్మడి దాడి చేయడానికి తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. మళ్లీ దాడులు జరగకుండా చర్యలు తీసుకోవాలన్నారు.

ఉప కమిషనర్ ఫిర్యాదు..కేసు నమోదు

జీడిమెట్ల: కుత్బుల్లాపూర్ సర్కిల్ జీహెచ్ఎంసీ ఉప కమిషనర్ ఫిర్యాదు మేరకు జీడిమెట్ల పోలీసులు ఇద్దరు భవన యజమానులపై కేసు నమోదు చేశారు. ఇన్‌స్పెక్టర్‌గడ్డం మల్లేష్ వివరాల ప్రకారం.. చింతల్ ప్రధాన రోడ్డులో శైలజ, సంధ్యారాణి అనే ఇద్దరు స్థల యజమానులు రెసిడెన్షియల్ అనుమతులు పొంది కమర్షియల్ నిర్మాణం చేపట్టారు. ఈ విషయమై ఉప కమిషనర్ నర్సింహకు ఫిర్యాదు అందటంతో ఆయన ఇటీవల బిల్డింగ్‌ను సీజ్ చేశారు. కొద్దిరోజులు బిల్డింగ్ నిర్మాణాలు నిలిపివేసిన ఇంటి యజమానులు.. అధికారులకు తెలియకుండా బిల్డింగ్ పనులు ప్రారంభించారు. ఈ విషయమై ఉప కమిషనర్ జీడిమెట్ల పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు ఇంటి యజమానులు సంధ్యారాణి, శైలజలపై కేసు నమోదు చేశారు.

ముగిసిన గణపతి ఆలయ బ్రహ్మోత్సవాలు

మల్కాజిగిరి: వసంతపురికాలనీలోని వల్లభ గణపతి దేవాలయం 30వ వార్షిక బ్రహ్మోత్సవాలు శనివారం ఘనంగా ముగిశాయి. చివరి రోజున పూర్ణాహుతి, కుంభాభిషేకం, ధ్వజారోహణం, స్వామి ఉత్సవమూర్తుల ఊరేగింపు జరిగింది. హంపీ విరూపాక్ష మహాసంస్థాన విద్యారణ్యస్వామి పూర్ణాహుతి నిర్వహించారు. అనంతరం భక్తులకు అనుగ్రహ భాషణం చేశారు. ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి పూజా కార్యక్రమంలో పాల్గొన్నారు. ఆలయ చైర్మన్ మురళీధర్ ఆయనను సన్మానించారు.

కాంట్రాక్టర్ అదృశ్యం



సాయి గంగాధర్

మల్కాజిగిరి: కాంట్రాక్టర్ అదృశ్యమైన ఘటన మల్కాజిగిరి పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. ఎస్సై కొండలు తెలిపిన వివరాల ప్రకారం.. వసంతపురికాలనీకి చెందిన సాయిగంగాధర్ (40) సివిల్ కాంట్రాక్టర్. 5 నెలల క్రితం భార్య బంధువుల ఇంటికి వెళ్లి 3 రోజుల్లోనే తిరిగొచ్చింది. ఆమె తిరిగొచ్చినప్పుడు ఇంటికి తాళం వేసి ఉంది. భర్తకు ఫోన్ చేయగా.. 4 రోజుల్లో ఇంటికి వస్తానని సమాధానం చెప్పాడు. అప్పటి నుంచి ఇంటికి రాకపోవడం, ఫోన్ కూడా స్విచ్ఛాఫ్ రావడంతో భార్య శనివారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు వారు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కంపెనీల ఏర్పాటుకు ఎదురుచూపులు !

- ఉపాధికి ఇతర ప్రాంతాలకు వెళ్లక తప్పని పరిస్థితి
- మందగమనంలో మౌలిక వసతుల కల్పన

పోచారం : నగరానికి తూర్పు వైపున కొత్త ఐటీ పార్కులు, కాలుష్యరహిత కంపెనీల ఏర్పాటుకు ప్రజలు ఎదురుచూస్తున్నారు. పశ్చిమ, ఉత్తర, దక్షిణ ప్రాంతాల్లో కంపెనీల ఏర్పాటు కోసం ప్రభుత్వం ప్రతిపాదనలు సిద్ధం చేసినట్లే తూర్పు వైపునా.. ప్రణాళికలకు రూపకల్పన చేయాల్సిన అవసరం ఉంది.

ఐటీ పార్కులకు సానుకూలం..

ఔటర్ రింగ్‌రోడ్డు లోపల వైపున ఉన్న పోచారం మున్సిపాలిటీలోని కాచవానిసింగారం, ప్రతాపసింగారం, కొర్రెముల్ ప్రాంతాల్లో ఐటీ పార్కులను ఏర్పాటు చేసేందుకు పరిస్థితులు అనుకూలంగా ఉన్నా.. ఆ దిశగా ప్రయత్నాలు కొనసాగడం లేదు.

ఉపాధి అవకాశాలు పెరిగే అవకాశం..

ప్రభుత్వ భూములు, నిషేధిత జాబితాలోని భూముల వివరాలను ప్రభుత్వం సేకరించి ఐటీ కంపెనీలను ఏర్పాటు చేస్తే నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు పెరుగుతాయని భావిస్తున్నారు. స్థానిక నాయకులు, ఉన్నతాధికారులు కృషిచేసి ఐటీ పార్కులను తీసుకురావాలని ఆశిస్తున్నారు.

అన్నీ అనుకూలతలు ఉన్నప్పటికీ..

పోచారం మున్సిపాలిటీ పరిధిలోని కొర్రెముల్,



ప్రతాపసింగారం, కాచవానిసింగారం వంటి పలు ప్రాంతాల్లో ప్రభుత్వ భూములతో పాటు నిషేధిత జాబితాల్లోని భూముల వివరాలను సేకరించి ఐటీ పార్కులను ఏర్పాటు చేస్తే తూర్పు ప్రాంతం రెట్టింపు వేగంతో అభివృద్ధి చెందుతుంది. ఆ దిశగా అధికారులు, ప్రజాప్రతినిధులు కృషి చేయాలని నిరుద్యోగ యువకులు కోరుతున్నారు.

భూములను వినియోగించుకోలేని విధానాలు...

భూములు అందుబాటులో ఉన్నా.. వినియోగించుకునే విధానాలు లేకపోవడంతో అభివృద్ధి మందగమనంతో కొనసాగుతోంది. ఔటర్‌రింగ్ రోడ్డు లోపలే ఉన్నా.. పోచారం మున్సిపాలిటీ ఐటీ పార్కుల ఏర్పాటుకు అన్ని విధాలా అనుకూలంగా ఉంటుంది. అలాగే పోచారం ఐటీ కారిడార్‌ను పూర్తి స్థాయిలో అభివృద్ధి చేయాలని, దీంతో ఈ ప్రాంతవాసులకు ఎంతో మేలు జరుగుతుందని ప్రజలు ఆశిస్తున్నారు. అందుకు ప్రభుత్వం నిర్దిష్టమైన ప్రణాళికలను రూపొందించాల్సి ఉంటుంది.

కాలుష్య రహిత పరిశ్రమలకు...

తూర్పు వైపున ఆశించిన స్థాయిలో ఐటీ రంగం అభివృద్ధి చెందకపోవడంతో ఈ ప్రాంతం నుంచి అనేక మంది ఇతర ప్రాంతాలకు వెళ్లి ఉద్యోగాలు చేసుకుంటూ రాకపోకలు సాగిస్తున్నారు. ఉద్యోగం, ఉపాధి అవకాశాలు కల్పించే ఐటీ సంస్థలు, కాలుష్యరహిత పరిశ్రమల ఏర్పాటుకు యువత ఎదురుచూస్తోంది.

నదుపాయాల లేమి...

పోచారం మున్సిపాలిటీ పరిధిలోని పలు ప్రాంతాల్లో రహదారులు, డ్రైనేజీ వ్యవస్థ, వర్షం నీటి నాలాలు, తాగునీటి సదుపాయాల లేమితో ప్రజలు ఇక్కట్లు పడుతున్నారు. మెరుగైన వసతులను కల్పించి ఈ ప్రాంత అభివృద్ధికి ప్రభుత్వం దోహదపడాలని, అందుకోసం అవసరమైన నిధులను ప్రభుత్వమే ప్రత్యేకంగా మంజూరు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

ఉపాధి కల్పనపై ప్రభుత్వం దృష్టి పెట్టాలి...



చదువుకున్న నిరుద్యోగులకు ఉద్యోగ, ఉపాధి కల్పనపై ప్రభుత్వం దృష్టి పెట్టాలి. అప్పుడే నగర తూర్పు భాగం విస్తరిస్తోంది. మానవవనరులను సమర్థవంతంగా వినియోగించుకోవాలంటే ఐటీ రంగంతో పాటు ఇతర రంగాలనూ ప్రోత్సహించాలి.

– వినోద్‌కుమార్, చౌదరిగూడ, పోచారం మున్సిపాలిటీ

రహదారుల అనుసంధానమైనా.. కంపెనీలు రాలేదు



పోచారం మున్సిపాలిటీకి ప్రధాన రహదారులతో కనెక్టివిటీ పెరిగినప్పటికీ కంపెనీలు రాలేదు. అభివృద్ధి ఒకేచోట కేంద్రీకృతం కాకుండా అన్ని ప్రాంతాల్లో జరగాలి. ఆ దిశగా ప్రభుత్వ పాలసీ ఉండాలి. ఇతర ప్రాంతాలతో పోటీపడేలా నగరం తూర్పువైపు కూడా విస్తరించాలి.

– మెట్టు నర్సింహారెడ్డి, సంస్కృతి టౌన్‌షిప్

పెద్దమ్మ విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాలు



ఆలయ ఉత్సవాల్లో ఎంపీ ఈటల రాజేందర్

మేడ్చల్: ఎల్లంపేట్ మున్సిపాలిటీ పరిధిలోని బండ మాదారంలో గ్రామస్తులు నిర్మించిన పెద్దమ్మతల్లి ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాలు శనివారం ఘనంగా నిర్వహించారు. వేదపండితులు సంప్రదాయబద్ధంగా అమ్మవారు, ఇతర దేవతల విగ్రహాలను ప్రతిష్ఠించారు. శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించి ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు. మల్కాజ్‌గిరి ఎంపీ ఈటల రాజేందర్, బీఆర్ఎస్, కాంగ్రెస్ నేతలు పాల్గొన్నారు. ఆకుల సురేష్, దేవేందర్‌రెడ్డి, ప్రభాకర్‌రెడ్డి వివిధ పార్టీల నాయకులు, గ్రామస్తులున్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన విద్య



బడిబాటలో పాల్గొన్న ఉపాధ్యాయులు, విద్యార్థినులు

మూసాపేట: మూసాపేటలోని ప్రభుత్వ బాలికల పాఠశాల ఆధ్వర్యంలో శనివారం బడిబాట కార్యక్రమం నిర్వహించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు కృష్ణకుమారి పాల్గొని వీధుల్లో తిరుగుతూ బడీడు పిల్లలను బడిలో చేర్పించాలని కోరారు. 2వ రోజు ఉపాధ్యాయ బృందం ఇంటింటికీ వెళ్లి పాఠశాలలో విద్యార్థులు సాధిస్తున్న ప్రతిభ గురించి, ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహం, మధ్యాహ్న భోజనం, ఉచిత పుస్తకాలు, కంప్యూటర్ విద్య, ఒకేషనల్ కోర్సులు మొదలు వాటిని వివరించారు. ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన విద్య లభిస్తుందన్నారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవంపై సమీక్ష



సమావేశంలో పాల్గొన్న ఎమ్మార్పీఎస్, అనుబంధ సంఘాల సభ్యులు

మల్లాపూర్: నాచారం బహుజన సాహిత్య అకాడమీ కార్యాలయంలో ఎమ్మార్పీఎస్, అనుబంధ సంఘాల జిల్లా అత్యవసర సమావేశాన్ని జిల్లా అధ్యక్షుడు ప్రణయ్ ఆధ్వర్యంలో నిర్వహించారు. శనివారం జరిగిన ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా మేడ్చల్ జిల్లా ఇన్‌చార్జి తిప్పారపు లక్ష్మణ్‌మాదిగ హాజరై మాట్లాడారు. జూలై 7న జరిగే ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించాలని పిలుపునిచ్చారు. ప్రతి గ్రామంలో కమిటీలను వేయాలన్నారు. మందకృష్ణ తన జీవితాన్ని సమాజం కోసం అంకితం చేశారని, ప్రతి సంక్షేమ పథకంలో ఆయన పోరాటం ఉందని, ఆయనకు పద్మశ్రీ రావడం సంతోషకరమన్నారు. జాతీయ కళామండలి అధ్యక్షుడు అశోక్‌మాదిగ, జాతీయ నాయకులు రాంచందర్, సీనియర్ నేతలు అంజి, కేశవ్, మహిళా అధ్యక్షురాలు సలోమి, శివ, స్వామి శ్రీనివాస్ పాల్గొన్నారు.

అంకితభావంతో సేవలు అందించాలి

సీఐఎస్ఎఫ్ ఐజీ నీలిమారాణిసింగ్



మాట్లాడుతున్న నీలిమా రాణిసింగ్



జ్ఞాపికను అందజేస్తూ..

జవహర్‌నగర్: హకీంపేటలోని నేషనల్ ఇండస్ట్రియల్ సెక్యూరిటీ అకాడమీ (నీసా) దీక్షత్ పరేడ్ గ్రౌండ్‌లో 49వ బ్యాచ్‌కు చెందిన 347 మంది ఎస్సైల పాసింగ్ అవుట్ పరేడ్ జరిగింది. శనివారం జరిగిన ఈ కార్యక్రమానికి సీఐఎస్ఎఫ్ ఇన్‌స్పెక్టర్ జనరల్ (ఐజీ) నీలిమా రాణిసింగ్ హాజరయ్యారు. ఆమె మాట్లాడుతూ.. దేశ సమగ్రతకు శిక్షణలో నేర్చుకున్న అత్యున్నత ప్రమాణాలను ప్రదర్శించాలన్నారు. విధుల్లో చేరుతున్నందున పట్టుదలతో దేశ భద్రతకు అంకితభావంతో సేవలు అందించాలని సూచించారు. పోటీతత్వంతో విధులు నిర్వహించి సీఐఎస్ఎఫ్‌కు మరింత పేరు తీసుకురావాలని చెప్పారు. శిక్షణలో ఉత్తమ ప్రతిభకనబర్చిన వారికి ఆమె జ్ఞాపికను అందజేశారు. నీసా డిప్యూటీ డైరెక్టర్, డీఐజీ శ్రీనివాసబాబు, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

అప్పుల బాధ భరించలేక..

వ్యక్తి అదృశ్యం



శంకరయ్య

ఘట్‌కేసర్: అప్పుల బాధ భరించలేక ఓ వ్యక్తి అదృశ్యమైన ఘటన ఘట్‌కేసర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ పరశురాం తెలిపిన వివరాల ప్రకారం.. ఘట్‌కేసర్‌కు చెందిన ధర్నబోయిన శంకరయ్య (62) ఈనెల 2న ఇంటి నుంచి బయటికి వెళ్లి తిరిగిరాలేదు. ఇంట్లో భార్య పరిశీలించగా.. 3 జతల దుస్తులు, బ్యాంకు పాస్‌బుక్ కనిపించలేదు. దీంతో కుమారుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. అప్పుల బాధ భరించలేక గతంలో ఇలాగే ఇంటి నుంచి వెళ్లి.. 5–6 రోజుల తర్వాత తిరిగొచ్చేవాడని కుటుంబసభ్యులు చెబుతున్నారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

త్రిపుర గవర్నర్ పరామర్శ



పద్మారెడ్డి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న త్రిపుర గవర్నర్ ఇంద్రాసేనారెడ్డి

మల్లాపూర్: ఇటీవల అనారోగ్యంతో మృతిచెందిన బీజేపీ నేత ఎంపాల పద్మారెడ్డి కుటుంబసభ్యులను త్రిపుర గవర్నర్ ఇంద్రాసేనారెడ్డి పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మల్కాజ్‌గిరి పార్లమెంట్ ఎన్నికల సమయంలో పద్మారెడ్డి పార్టీ విజయం కోసం అవిశ్రాంతంగా కృషి చేశారని ఈ సందర్భంగా గుర్తు చేశారు. వారి మరణం బాధాకరమన్నారు. వారి ఆత్మకు శాంతి చేకూరాలని, కుటుంబసభ్యులకు మనోధైర్యంగా ఉండాలన్నారు. మాజీ ఎమ్మెల్యే ఎన్వీఎస్ఎస్ ప్రభాకర్, మేడ్చల్ అర్బన్ జిల్లా అధ్యక్షుడు మల్లారెడ్డి, సత్యనారాయణ, రవినాయక్, మోహన్‌రెడ్డి, బాలచందర్, డివిజన్ అధ్యక్షుడు కొమ్మగళ్ల నవీన్‌కుమార్, రాగిరి మోహన్‌రెడ్డి, ప్రకాష్, రవికాంత్, మంజు, జ్యోతి, లావణ్య తదితరులున్నారు.

ఉరేసుకుని యువకుడి ఆత్మహత్య



వివేక్ మృతదేహం

మల్లాపూర్: చెట్టుకు ఉరేసుకుని ఓ యువకుడు ఆత్మహత్యకు పాల్పడిన ఘటన నాచారం పోలీస్‌స్టేషన్ పరిధిలో శనివారం చోటుచేసుకుంది. ఎస్సై వెంకటయ్య తెలిపిన వివరాల ప్రకారం.. న్యూబోయిన్‌పల్లికి చెందిన టీకాబాయి కుమారుడు వీఎస్.వివేక్ (19) మల్లాపూర్ పారిశ్రామికవాడలోని సిగ్మా కంపెనీలో హెల్పర్‌గా పనిచేస్తున్నాడు. కాగా 6న ఇంట్లో నుంచి కంపెనీకి వచ్చి, రాత్రి 12 గంటలకు ఇంటికి వస్తానని సహోద్యోగి రవి ఫోన్‌తో తల్లికి ఫోన్‌చేసి చెప్పాడు. తెల్లారిన తిరిగి ఇంటికి రాకపోవడంతో ఆమె కంపెనీ యజమాని మహేందర్‌రెడ్డిని అడిగింది. ఇంతలో నాచారం చౌరస్తా బస్‌స్టాప్ వద్ద చెట్టుకు ఉరేసుకుని కనిపించాడు. ఘటనా స్థలంలో ఎలాంటి ఆధారాలు లభించలేదని పోలీసులు చెబుతున్నారు. తల్లి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కాలనీ సమస్యలు పరిష్కరించాలని వినతి



స్థానికులతో మాట్లాడుతున్న కార్పొరేటర్ స్వర్ణరాజ్ శివమణి

కాప్రా: శ్రీనివాస ఆఫీసర్స్ కాలనీలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని కాలనీవాసులు కార్పొరేటర్ స్వర్ణరాజ్ శివమణి దృష్టికి తీసుకెళ్లారు. శనివారం కాలనీలో పర్యటించిన కార్పొరేటర్ డ్రైనేజీ, రోడ్లు, వీధిదీపాల సమస్యలతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామన్నారు. దీనిపై సానుకూలంగా స్పందించిన ఆయన త్వరలోనే సమస్యలు పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. కాలనీ అధ్యక్షుడు భాస్కర్‌రెడ్డి, కార్యదర్శి సుభాష్‌రెడ్డి, సభ్యులు ఠాగూర్, చంద్రమౌళీశ్వరరావు, శంకర్‌రావు, ఇంద్రారెడ్డి, రాజుగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

సీఎం రిలీఫ్ ఫండ్ పేదలకు వరం

ఉప్పల్: సీఎం రిలీఫ్ ఫండ్ పేదలకు వరమని, చిలుకానగర్ డివిజన్ కార్పొరేటర్ బన్నాల గీత ప్రవీణ్‌ముదిరాజ్ అన్నారు. చిలుకానగర్ డివిజన్‌కు చెందిన కొల్లూరి సమ్మమ్మ లంగ్స్ వ్యాధితో ఆసుపత్రిలో చేరింది. ఆమె ఆర్థిక పరిస్థితిని ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి దృష్టికి తీసుకురావడంతో ఆయన స్పందించి, సీఎం రిలీఫ్ ఫండ్ అందేలా కృషి చేసినట్లు కార్పొరేటర్ తెలిపారు. నియోజకవర్గంలో పేదలకు ఎలాంటి ఇబ్బంది కలిగినా తన దృష్టికి తీసుకురావాలని ఎమ్మెల్యే సూచించినట్లు సమాచారం. బీఆర్ఎస్ నేత బన్నాల ప్రవీణ్‌ముదిరాజ్, కొండల్‌రెడ్డి, జగన్, శ్రీనివాస్, బాలకృష్ణగౌడ్ తదితరులు పాల్గొన్నారు.



బాధితురాలికి చెక్కును అందజేస్తున్న కార్పొరేటర్ గీత

పద్మశాలి సంఘం నూతన కార్యవర్గం ఏకగ్రీవం



రామంతాపూర్ : పద్మశాలి సంఘం నూతన కార్యవర్గాన్ని శనివారం స్థానిక మార్కండేయస్వామి ఆలయ ప్రాంగణంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా కొండా కృష్ణమూర్తి, ప్రధాన కార్యదర్శిగా శిరీషాల విజయప్రకాష్, కోశాధికారిగా కొంగరి బాలచంద్రయ్య, ఉపాధ్యక్షులుగా స్వామి, యాదగిరి, ఏలే రమేష్, జాయింట్ సెక్రటరీలుగా శేఖర్ గజం మురళీ, ఆర్గనైజింగ్ సెక్రటరీలుగా వేణు, నరసింహులు, సహాయ కోశాధికారిగా మురళీ, ఎగ్జిక్యూటివ్ మెంబర్‌గా నారాయణదాసు, సురేష్, సలహాదారులుగా రామ్‌నర్సయ్య, రవీందర్, వెంకటయ్య, రాములు, యాదగిరి, చిక్క సత్యనారాయణ తదితరులు ఎన్నికయ్యారు. అనంతరం నూతన కమిటీని ఎలక్షన్ అధికారి అడ్వకేట్ మాచర్ల రంగయ్య సమక్షంలో ప్రమాణ స్వీకారం చేశారు. తిరందాసు లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.

పార్టీలకతీతంగా నియోజకవర్గ అభివృద్ధి

ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి



అల్వాల్: పార్టీలకు అతీతంగా మల్కాజిగిరి నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తున్నామని ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి అన్నారు. శనివారం అల్వాల్ హిల్స్ సెయింట్ పాయిస్ స్కూల్ వద్ద సీసీరోడ్డు పనులకు ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. నియోజవకర్గంలో మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తున్నామన్నారు. డోలి రమేష్, పరమేష్, లక్ష్మణ్‌యాదవ్, రమేష్, ప్రశాంత్‌రెడ్డి, వెంకటేష్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

కీసర బీజేపీ నూతన కార్యవర్గం

కీసర: కీసర మండల బీజేపీ పార్టీ నూతన కార్యవర్గ సభ్యులను మండల అధ్యక్షుడు కోల బాలరాజు యాదవ్ నియమించారు. మేడ్చల్ రూరల్ జిల్లా అధ్యక్షుడు బుద్ధ శ్రీనివాస్, మండల ఇన్‌చార్జ్ శ్యామ్‌సుందర్‌శర్మ ఆదేశానుసారం నూతన కార్యవర్గాన్ని నియమించామన్నారు. మండల ఉపాధ్యక్షులుగా ఉట్కూరి పవన్‌గౌడ్, తోకటి దుర్గేష్, చిందం సంధ్యారాణి, కోల మహేందర్‌యాదవ్, ప్రధాన కార్యదర్శులుగా నల్ల వెంకట్‌రెడ్డి, నాగరాజు, కార్యదర్శులుగా డొంకెని శాలిని, పైళ్ల శ్రీనివాస్‌రెడ్డి, రాజేంద్రప్రసాద్‌గౌడ్, గడ్డం శ్రీనివాస్, కోశాధికారిగా తర్రె సత్యనారాయణయాదవ్ నియమితులయ్యారు.

త్యాగానికి ప్రతీక బక్రీద్

ఘనంగా బక్రీద్ వేడుకలు



జవహర్‌నగర్‌లో బక్రీద్ ప్రార్థనల్లో ముస్లిం సోదరులు

జవహర్‌నగర్: కార్పొరేషన్ పరిధిలో బక్రీద్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. శనివారం జవహర్‌నగర్‌లోని పలు ఈద్గాలలో జవహర్‌నగర్ ముస్లిం వెల్ఫేర్ అసోసియేషన్ కమిటీ అధ్యక్షులు మహ్మద్ పాషామియా, కార్యదర్శి కాలేషా ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు.

మేడ్చల్: త్యాగానికి ప్రతీకైన బక్రీద్ పండగను మేడ్చల్, ఎల్లంపేట్ మున్సిపాలిటీల్లో ముస్లింలు ఘనంగా నిర్వహించుకున్నారు. ఉదయం మజిద్‌లు, ఈద్గాల వద్ద ప్రత్యేక ప్రార్థనలు చేసి పండగ శుభాకాంక్షలు చెప్పుకున్నారు.

మేడ్చల్‌రూరల్: గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీతో పాటు పలు గ్రామాల్లో ముస్లింలు బక్రీద్ వేడుకలు ఘనంగా చేసుకున్నారు. బక్రీద్ సందర్భంగా ఉదయాన్నే ప్రత్యేక ప్రార్థనలు చేశారు.



డబీల్‌పూర్‌లో శుభాకాంక్షలు చెప్పుకుంటున్న నేతలు

కీసర: త్యాగానికి ప్రతీకగా నిలిచే బక్రీద్ పండుగ వేడుకలను శనివారం నాగారం మున్సిపాలిటీలో ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా పలు దర్గాలు, మసీదుల్లో ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు చేశారు.